**ప్రకృతి - వికృతి!**

ఉన్నది నిజమైన,పోవుట కలయా?!
పోవుట నిజమైన,ఉన్నది భ్రమయా?!

పోవుటయె ప్రకృతియైన, వికృతికై
ఆర్భాటమేమిటో ఈ ఆరాటమేమిటో!

ఉనికి నిజమైన కనుమరుగు లేమిటో
నడచిన ఈ కలల,కథల ఊసేమిటో?!

వచ్చిన చోటికే అయిదు చేరిపోతే
అచ్చంగ మిగిలేది ఒక్కటే! "జ్ఞాపకం"!

అది నిజమా? అబద్ధమా? మాయా?

జ్ఞాపకాల మంజూషం లో దొంతరలు
మెరిసేవి,వెలతెలపోయేవి,అన్నీనూ!

దొంతరల మధ్యలో మల్లెలు,జాజులు
ముళ్ల గులాబీలు,గుచ్చే కంటకాలూ!!

*********

మనసుకి రూపం ఏమిటో?!
వచ్చీ పోయే ఆలోచనలే!!

మనిషికి అస్తిత్వం ఏదీ?!
నిలిచిపోయే జ్ఞాపకాలే!!

బ్రతుకుకు పరమార్థం ఏదీ?!
అనుత్తర నిత్యప్రశ్న యిది!!
*******

మిగలని వాటి కోసం,శాశ్వతమనుకొని ప్రయత్నం!
అసలు నీవే మిగలవు, మరి పరుగు లెక్కడికి?!

వెతుకుతుంటే తెలియదు,దొరికింది మిగలదని!
తీరం దాటాక తెలిసే అందం పేరు ఈ జీవితమని!

ఏదో తెలిసిందనే లోపు,కరిగే కాలం!సాయం సంధ్య!
ఇదే జీవితం! పరీక్ష తరువాత అర్థమయ్యే పాఠం!!

ఎప్పటికీ ఉండిపోయే నిజమని భ్రమింపచేస్తుంది!
మంచులా కరిగి కనుల ముందే నీరై జారి పోతుంది!!

ఇది గట్టిదేమిటి? ఓటి పడవకు కోటి చిల్లులు!
కోటలా కనిపిస్తుంది!పిచ్చుక గూడై కూలిపోతుంది!

పల్లవి అయిందో లేదో ముక్తాయింపు అందుకుంటుంది!
చరణాలు, - తోరణం తెగిన గుమ్మంలా తెల్లబోతాయి!

చెప్పా పెట్టకుండా,ఒక్కడినే ఇల్లు ఖాళీ చేయిస్తుంది!
రాసేవాక్యం,గీసేబొమ్మ,మధ్యలోనే!,ముగింపు అందక!

పాత్రే తాననుకొని ఆడే వింత నాటకం ఈ జీవితం! నిడివీ,నిష్క్రమణా,అదృశ్య ప్రయోక్త హస్త కౌశలం!!

అయినా ----

ఊపిరిలున్నంత వరకు కృషి నీదే,కర్తవ్యం నీదే
తేలికైన మనసుతో వాలిపోతే సార్ధకత,అదే!!

అదే గమ్యం,అదే సాధన,అదే ధన్యత,అదే మోక్షం!!

*******